క్లుప్తంగా

విజయదుర్గాలయంలో పౌర్ణమి పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప సెవెన్‌రోడ్స్‌ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన 18 పవిత్ర కలశాలతో విశేష అభిషేకం నిర్వహించారు. ఈ 18 కలశాలను 18 మంది దంపతులు భక్తులతో కలిసి ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వాటిని అర్చకులకు అందజేశారు. పవిత్ర కలశాలతో విజయదుర్గమ్మకు స్నపనం నిర్వహించారు. అనంతరం చక్కగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పౌర్ణమి పూజల్లో భాగంగా ఉదయం 10 గంటలకు చండీహోమం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మ, స్వామి వార్లకు 108 దీపాలతో 108 మంది ముత్తయిదువుల ద్వారా అష్టోత్తర దీపాలంకార సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

12 ఏఐవైఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఈనెల 12న ఏఐవైఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమిన్‌ భవన్‌లో ఏఐవైఎఫ్‌ నగర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ఈనెల 1వ తేదీ విడుదల చేసిన ఉత్తర్వులను ఏఐఎస్‌ఎఫ్‌ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప నగర అధ్యక్షులు అకిరానందన్‌, జిల్లా గర్ల్స్‌ కన్వీనర్‌ నిఖిత, నగర ఉపాధ్యక్షులు అశోక్‌, లోకాభిరామ్‌, సహాయ కార్యదర్శి మల్లికార్జున్‌ రెడ్డి నాయకులు మదన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్విట్‌ ఇండియా స్ఫూర్తితో ఉద్యమిస్తాం

కడప ఎడ్యుకేషన్‌ : దేశంలో భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రభుత్వ సంపదను కార్పొరేట్‌ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్‌ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. కడప నగరం ప్రకాష్‌ నగర్‌లోని ప్రభుత్వ బాలుర వసతి గృహం వద్ద క్విట్‌ ఇండియా మూమెంట్‌ డే సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆర్‌వైఎఫ్‌, పిఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చూడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, సుదీర్‌ హరి, జీవన్‌, రమేష్‌ నాయక్‌, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రక్షా బంధన్‌



చిన్నారుల రాఖీ పండుగ

కడప సెవెన్‌రోడ్స్‌ : రక్షాబంధన్‌ సందర్భంగా శనివారం ఆశారేఖ ఫౌండేషన్‌ అధ్యక్షులు నెమలిదిన్నె నాగవేణి నగరంలోని జువైనల్‌ హోం, అర్బన్‌ రెసిడెన్సి హోమ్‌లలోని చిన్నారులకు రాఖీ కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు రాఖీ కట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంస్థ ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా అనాథ పిల్లలకు రాఖీలు కట్టడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. అలాగే ఇంటర్నేషనల్‌ ఢిల్లీ పబ్లిక్‌ స్కూలుతోపాటు ఇతర విద్యా సంస్థల్లో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు.

చిలుకూరికి ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్‌ : తెలుగులో పిహెచ్‌డి పట్టా పొందిన తొలి పరిశోధకుడు డా. చిలుకూరి నారాయణరావని, ఆయన మద్రాసు విశ్వవిద్యాలయం ద్వారా ఆ పట్టాను సాధించారని సి.పి.బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి. బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం శనివారం ప్రసిద్ధ భాషావేత్త డా. చిలుకూరి నారాయణరావు 137వ జయంతిని ఘనంగా నిర్వహించింది. చిలుకూరి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, మరో సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ చిలుకూరి రచనలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీ లక్ష్మి పాలకొండ్రాయస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



మాంగల్యాన్ని భక్తులకు దర్శింపజేస్తున్న అర్చకుడు

కడప సెవెన్‌రోడ్స్‌ : శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని కడప సమీపంలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు యోగేశ్వరశర్మ, ఇతర అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు అశేష భక్తజనం తరలివచ్చారు. కల్యాణ క్రతువులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహ వాచనం, విశ్వక్సేన ఆరాధన, కలశారాధన, మాంగల్య పూజ, యజ్ఞోపవీత ధారణం, కన్యాదానం, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు, అనంతరం మాల పరివర్తనం తదితర కార్యక్రమాలను శ్రీవైష్ణవ పాంచరాత్ర ఆగమోక్త ప్రకారంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి మల్లికార్జునప్రసాద్‌, ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్‌ రెడ్డెయ్య యాదవ్‌, ఇతర అధికారులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

బంగారు నామాల సమర్పణ



రాయచోటికి చెందిన సగబాల పార్వతమ్మ అనే భక్తురాలు తన భర్త సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం తమ ఇంటి వేల్పు అయిన శ్రీ పాలకొండ్రాయస్వామికి మూడు తులాల బంగారుతో రూపొందించిన నామాలను సమర్పించారు. స్వామి వారి కల్యాణానికి తన కుటుంబ సభ్యులు ధనలక్ష్మి, లక్ష్మి, దేవసేని లీలా శ్రీకర్‌, దండే వెంకట సుబ్బయ్య, కొరివి చంద్రశేఖర్‌, ప్రకాశ్‌ తదితరులతో ఆమె కలిసి వచ్చారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు యోగేశ్వరశర్మ ద్వారా సమర్పించారు.

• కల్యాణ వైభోగమే



కల్యాణ మూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప సెవెన్‌రోడ్స్‌ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్‌ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మున్సిపల్‌ కార్మికులకు పీఆర్సీ ప్రకటించాలి



సమ్మె చేస్తున్న మున్సిపల్‌ కార్మికులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : మున్సిపల్‌ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేసి 12 వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ గౌరవ అధ్యక్షులు కేసీ బాదుల్లా, కార్యదర్శి తారక రామారావు డిమాండ్‌ చేశారు. శనివారం నగరంలోని పాత మున్సిపల్‌ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్‌ వర్కర్‌ యూనియన్‌ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెంబరు 36ను అమలు చేయకుండా కొత్తజీవో 124 ప్రకారం మూడు క్యాటగిరీల ఇంజనీరింగ్‌ ఔట్‌సోర్సింగ్‌ కార్మికులకు కేవలం మూడు వేలు మాత్రమే పెంచిందన్నారు. కార్మికులు ఈ జీతం పెంపుపై అసంతృప్తిగా ఉన్నారన్నారు. మున్సిపల్‌ శాఖ మంత్రి నారాయణ మున్సిపల్‌ కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి అమరావతి చుట్టూ తిరుగుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో చెత్త పన్ను క్లాప్‌ మిత్ర అవినీతిలో చిరు ఉద్యోగులను బలి పశువులు చేసి ఉన్నత స్థాయి అధికారులను రక్షించాలనే ఆలోచనలను విరమించుకోవాలని, సమగ్ర పారదర్శక న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు చంద్ర, కంచుపాటి జాన్‌, జనార్ధన, వెంకటాద్రి, మేలంగి రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు గిరిజన సంక్షేమానికి చేయూతనివ్వాలి



ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంస్థ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వారికి అన్ని విధాల చేయూతనివ్వాలని రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కేద్రి శ్రావణ్‌ కుమార్‌ కోరారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప తారకరామ నగర్‌లో సంబరాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక వర్గాల వారిగా సర్వే చేపట్టి ఎస్టీ వర్గీకరణ చేపట్టి యానాది ఎరుకుల కులాలకు మేలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్‌, సింధు, కిరణ్‌, శివ, కిట్టు, శీను, మల్లికార్జున, రెడ్డయ్య, వీరేష్‌ , వెంకటేష్‌, జయమ్మ, నాగలక్ష్మి, మల్లీశ్వరి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్‌ డీఐజీ డాక్టర్‌ కోయ ప్రవీణ్‌, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌ కుమార్‌ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసు స్టేషన్‌ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్‌ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, ఓవర్‌ స్పీడ్‌, ఓవర్‌ లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, డ్రంకెన్‌ డ్రైవ్‌ చేయరాదని తెలియజేస్తూ రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

అమెరికా దురాగతానికి సాక్ష్యాలు హిరోషిమా, నాగసాకి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్‌

కడప ఎడ్యుకేషన్‌ : రెండవ ప్రపంచ యుద్ధం ముగుస్తున్న సమయంలో అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టు కోవడానికి ప్రపంచ దేశాలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబులను ప్రయోగించిందని ఏపీ జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌ అన్నారు. శనివారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జేవీవీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా హిరోషిమాపై వేసిన బాంబుతో మానవులంతా మాంసపు ముద్దలుగా మారిపోయారన్నారు. లక్షల మంది జనాలు మృత్యువాత పడ్డారన్నారు. జేవీవీ రాష్ట్ర సలహామండలి సభ్యులు సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అంశాల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మూఢ నమ్మకాలకు సంబంధించి ప్రదర్శనలు ప్రజలను ఆలోచింప చేశాయన్నారు. జాతీయ ప్రచార కార్యదర్శి సనావుల్లా, జేవీవీ నాయకులు సుధాకర్‌, ప్రొఫెసర్‌ వెంకటరామిరెడ్డి, ఎస్టీయూ నాయకులు ఇలియాష్‌బాషా, సీపీఐ నాయకులు నాగసుబ్బారెడ్డి, మల్లికార్జున, బాగ్యమ్మ, మహబూబ్‌బాషా, బయన్న, నరసింహులు, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు



తిరుణాలలో బండలాగుతున్న ఎద్దులు



విశేష అలంకారంలో ఆంజనేయస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ పంచాయతీలోని రెడ్డిపల్లె సమీపంలో వెలసిన శ్రీభేతాల అంజనేయస్వామి వార్షికోత్సవ ఉత్సవా లు శ్రావణమాస మూడవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, నవగ్రహ పూజ, ఆకుపూజ, రుద్ర హోమం, మహామంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని ఆంజనేయ స్వామి దేవాలయాలలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే ఏఎల్‌ కాలనీ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు, కోలాటం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా మహాసభలు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి , సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఒంగోలులో జరగబోతున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు సందర్భంగా ఆగస్టు 23న జరుగు భారీ ప్రదర్శన బహిరంగ సభకు ప్రజలు పాల్గొనాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు, రాష్ట్ర రాజధాని నిర్మాణ బాధ్యత, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆర్థిక లోటు భర్తీ, విద్యా, వైద్య సంస్థల ఏర్పాటులో కేంద్రం తీవ్రమైన నిర్లక్ష్యం అవలంబిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ, కేసి బాదుల్లా, కే మునెయ్య, జి నాగేశ్వరరావు, చంద్రకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

కమలాపురం : మండలంలోని సి.గోపులాపురం-పాచికలపాడు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో గోపులాపురం-పాచికలపాడు మధ్య ఉన్న చిన్నపాటి వంక పొంగి ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా గోపులాపురం గ్రామ ప్రజలు పొలాలకు వెళ్లాలంటే ఈ వంకను దాటి వెళ్లాల్సిందే. పశు గ్రాసం తెచ్చుకోవాలన్నా, పొలం పనులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

నూలివీడులో వెలుగుచూసిన శాసనం



కడప సెవెన్‌రోడ్స్‌: గాలివీడు మండలం నూలివీడులో అరుదైన శాసనం వెలుగు చూసినట్లు ఆర్కియాలజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ (ఎపిగ్రఫీ) మునిరత్నంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పాఠశాల ఉపాధ్యాయుని సమాచారం మేరకు నూలివీడు గ్రామ సమీపాన ఉన్న ఓ పెద్ద రాతి గుండుకు ఈ శాసనం మలిచారని తెలిపారు. విజయనగర కాలం నాటి శాసనంగా గుర్తించామని పేర్కొన్నారు.

గురుకులాలలో పాత టైం టేబుల్‌ ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: డాక్టర్‌ బి.ఆర్‌ అంబేద్కర్‌ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పాత టైం టేబుల్‌ ప్రవేశపెట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలో డాక్టర్‌ బి.ఆర్‌ అంబేద్కర్‌ గురుకుల టీచర్స్‌ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గురుకులాలలో జీవో నెంబర్‌ 46 (ఎస్‌ఓపి) ప్రకారం 7.45 నిమిషాల నుండి 3.00 గంటల దాకా టైం టేబుల్‌ ప్రస్తుతం అమలులో ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా గురుకులాలలో క్వార్టర్స్‌ లేవని, ఉన్నా అర కొరగా ఉన్నాయన్నారు. గురుకులాల్లో మహిళలు అధిక భాగం టీచర్స్‌గా ఉన్నారని, వారు ఉదయాన్నే ఇంటి పనులు, వారి పిల్లల పనులు చూసి కనీసం 20 లేదా 30 కిలోమీటర్లు ప్రయాణించి పాఠశాలకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. ఇది మహిళా టీచర్లకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. పాత టైం టేబుల్‌ 8:45 నిమిషాల నుండి నాలుగు గంటల దాకా అమలు చేయాలని కోరారు. ఎస్టీయూ గురుకులాల విభాగం నాయకులు డాక్టర్‌ లక్ష్మీనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షులు సురేష్‌ బాబు, ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షులు ఇలియాస్‌ బాషా మాట్లాడుతూ సొసైటీ సమస్యలు, కాంట్రాక్ట్‌ టీచర్ల రెగ్యులరైజేషన్‌, పార్ట్‌ టైం టీచర్ల ఉద్యోగ భద్రత, పదోన్నతులు, పార్ట్‌ టైం టీచర్ల వేతనాలు విడుదల వంటి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్టీయూ గురుకుల విభాగం నాయకులు జీ శ్రీనివాసులు గురుకుల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైన్‌ ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



లక్కీడిప్‌ ద్వారా విజేతలను ప్రకటిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ప్రస్తుత వివాహ సీజన్‌ను పురస్కరించుకుని ప్రముఖ బంగారు ఆభరణాల విక్రయ సంస్థ జోస్‌ అలుక్కాస్‌ అమలుచేస్తున్న చైన్‌ ఫెస్ట్‌ను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ మేనేజర్‌ గణేష్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ సినోజ్‌లు పిలుపునిచ్చారు. శనివారం కడప ఆర్టీసీ బస్టాండు వద్దగల సంస్థ షోరూంలో ఫెస్ట్‌లో భాగంగా లక్కీడిప్‌ తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ జులై 25 నుంచి ఆగస్టు 15వ తేది వరకు తాము చైన్‌ ఫెస్ట్‌ను నిర్వహించి కొనుగోదారులకు విలువైన బహుమతులు అందజేస్తున్నామన్నారు. అలాగే తమ వద్ద నగల కొనుగోలుకు ఫ్లాట్‌ 5 శాతం తరుగు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఓ పవన్‌ పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత నివారించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను తక్షణం తీర్చకపోతే ఆందోళన తప్పదని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు. శనివారం యూరియా కొరతపై నగరంలో ఎరువుల దుకాణాలను ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభానికి ముందే జిల్లాలో 77,475 హెక్టార్లు పంటల సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా గట్టి 20,500 మెట్రిక్‌ టన్నుల యూరియా అవసరం కాగా 12 వేల మెట్రిక్‌ టన్నులు కేటాయించి చివరకు 4062 మెట్రిక్‌ టన్నులు ఇచ్చిందన్నారు. అంచనాలకు భిన్నంగా కేటాయించడమే కాకుండా కేటాయించిన వాటిని కూడా ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరి కాదన్నారు. కేసీ కెనాల్‌ ఆయకట్టుకు నీళ్లు రావడంతో యూరియాకు డిమాండు వచ్చిందన్నారు. యూరియా ఇతర ఎరువులను డీలర్ల ద్వారా కడప జిల్లా వ్యాప్తంగా అన్ని షాపులకు రైతులకు సరిపడనంత సరఫరా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హజ్‌ యాత్రికులను మోసం చేస్తున్న ప్రభుత్వం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఆంధ్రప్రదేశ్‌ గన్నవరం నుంచి హజ్‌ యాత్ర చేసిన 72 మందికి మాత్రమే లక్ష రూపాయలు సబ్సిడీ ఇస్తూ మిగతా హైదరాబాద్‌ బెంగళూరు నుండి వెళ్లిన ఆంధ్ర వాళ్లకు సబ్సిడీ ఇవ్వకపోవడం చూస్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలతో డబుల్‌ గేమ్‌ ఆడుతోందని ఆప్‌ కి ఆవాజ్‌ రాష్ట్ర కార్యదర్శి షేక్‌ మక్బూల్‌ బాషా ఆవేదన వ్యక్తం చేశారు.

శనివారం నగరంలోని ఆప్‌ కి ఆవాజ్‌ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రానికి చెందిన హజ్‌ యాత్రికులు హైదరాబాద్‌, బెంగళూరు నుంచి కూడా మక్కాకు వెళ్లి వచ్చారని తెలిపారు. వారికి మాత్రం ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదన్నారు. గత వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వం హజ్‌ యాత్రికులకు తెల్లరేషన్‌ కార్డు కలిగిన వారికి రూ.60 వేలు, ఇతరులకు రూ.30 వేలు సబ్సిడీ ఇవ్వడమే కాకుండా గన్నవరం ఎంబార్కేషన్‌ పాయింట్‌ నుంచి వెళ్లే యాత్రికుల నుంచి వసూలు చేసే అదనపు సొమ్మును కూడా తిరిగి చెల్లించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబట్టారు.

వరద నీటి కష్టాలు తీరేదెన్నడో?



బుడగజంగంకాలనీలో

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం 48వ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో గత రెండురోజులుగా కురిసిన వర్షాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లోని కృపా కాలనీ, బుడగ జంగం కాలనీ, రామాంజనేయ నగర్‌, పరమేశ్వర స్కూల్‌ వీధి, రామరాజుపల్లి, ఆచారి కాలనీ ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ ప్రాంతాలు కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాలు చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాలలో కొన్ని విధుల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. అదే విధంగా ఖాళీ స్థలాల్లో మురికి నీరు వరద నీటితో కలిసి నిల్వ వుండటం వల్ల స్థానికులు చాలా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు, వృద్ధులు ఈ వరద నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కార్పొరేషన్‌ అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పరమేశ్వర స్కూలు వీధిలో



కృపా కాలనీలో వర్షపు నీటిలో నడుచుకుని వెళుతున్న చిన్నారులు